పేద రజక విద్యార్థులకు అవార్డులు అందిస్తాం..

రామంతాపూర్, ఫిబ్రవరి 9 : తెలంగాణకు చెందిన పేద రజక విద్యార్థులకు అవార్డులు అందజేస్తామని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రజక విద్యాసేవా సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవలూటి శంకర్ తెలిపారు. ఆదివారం రామంతాపూర్ సంఘం భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ విద్యాసంవత్సరం నుంచి పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు, తల్లి తండ్రులు లేని వారికి ప్రతిభ ఆధారంగా నగదు పారితోషికాలు అందజేస్తామన్నారు. రజక సేవా సంఘం తెలంగాణ అధ్యక్షుడు గోపి రజక, బస్వరాజ్, చంద్రయ్య, వెంకటయ్య, కాశయ్య, శివ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వివాదాస్పదమైన ఆఖరి మజిలీ!

- సుతారిగూడలో సమాధికి క్రైస్తవ మత పెద్దల అభ్యంతరం
- మత పెద్దల తీరుపై సభ్యుల ఆగ్రహం

మేడ్చల్‌లో డంపింగ్‌యార్డు వద్ద కేటాయించిన స్థలం

మేడ్చల్, ఫిబ్రవరి 9: అఖరి మజిలీపై వివాదం తలెత్తింది. ఒక సామాజిక వర్గానికి చెందిన ప్రజలు ఒక చోట సమాధి చేస్తామని చెబుతుంటే మత పెద్దలు అభ్యంతరం పెట్టడం వివాదానికి దారి తీసింది.

చర్చి సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మేడ్చల్ పట్టణంలోని ఉమానగర్‌లో సుమారు 22 ఏండ్ల కిందట సెయింట్ జోసెఫ్ చర్చిని నిర్మించారు. ఆ చర్చి పరిధిలో దాదాపు 180 నుంచి 200 కుటుంబాలు ఉన్నాయి. ఎవరైనా చనిపోతే సమాధి చేసేందుకు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ సుతారిగూడ చెరువు పక్కన 111, 112 సర్వే నెంబర్లలో అర ఎకరం స్థలం చర్చి ట్రస్టు ఆధ్వర్యంలో కొనుగోలు చేశారు. కాగా మేడ్చల్ పట్టణంలోని రైల్వే కాలనీ సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద కూడా సమాధి కోసం 2.20 ఎకరాల స్థలం ఉన్నది. అయితే ఆ స్థలంలోకి వెళ్లడానికి దారి అనుకూలంగా లేకపోవడంతో సుతారిగూడ వద్ద ఉన్న స్థలానికి వెళ్లేందుకే చర్చి పరిధిలోని సభ్యులు మొగ్గుచూపుతున్నారు.

అంతిమ సంస్కారానికి రానన్న పెద్దలు

సెయింట్ జోసెఫ్ చర్చి పరిధికి చెందిన జోసెఫ్ శనివారం మృతి చెందాడు. ఆయన సంబంధీకులు మేడ్చల్ ప్రాంతంలో అధికారిక హోదాలో ఉన్న ఫాదర్ మ్యాథ్యూను సంప్రదించి తమకు సుతారిగూడ సమాధి చేసేందుకు అనుమతించాలని కోరారు. ఇందుకు ఆయన అంగీకరించలేదు. మేడ్చల్ స్థలంలోనే సమాధి చేయాలని సూచించారు. డంపింగ్ యార్డు వద్ద ఉన్న ఆ స్థలం అంత్యక్రియలు నిర్వహించడానికి ఏమాత్రం అనుకూలంగా లేదని, సరియైన దారి కూడా లేదని, తాము గతంలో పలువురికి సుతారిగూడలోనే అంత్యక్రియలు నిర్వహించాని తెలిపారు. సుతారిగూడలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం సెయింట్ జోసెఫ్ చర్చిలో జోసెఫ్ అంతిమ సంస్కారానికి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సమక్షంలో ఫాదర్ ఆంథోని, ఫాదర్ ఇన్నయ్య ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కానీ వివాదం నేపథ్యంలో అంతిమ సంస్కారాలు నిర్వహించే చోటుకి రాలేమని చెప్పారు. సాధారణంగా సమాధి చేసే చోటుకి ఫాదర్లు వచ్చి అంతిమ సంస్కారాలను దగ్గరుండి జరిపిస్తారని, కానీ వారు అక్కడికి రాలేమని చెప్పారని మృతుడి సంబంధీకులు పేర్కొంటున్నారు. మత విశ్వాసాల ప్రకారం మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలంటే సమాధి వద్ద ప్రార్థనలు చేయాలని కోరినా రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు చర్చి సభ్యుడు బాలస్వామి సుతారిగూడలో సమాధి చేసే చోట ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం జోసెఫ్ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు సమాధి చేశారు.

హారన్ మోగించడం ఆపేద్దాం..

ఉప్పల్, ఫిబ్రవరి 9 : రోడ్ సేఫ్టీ స్క్వాడ్, డ్రైవ్ సేఫ్ హైదరాబాద్ బృందం ఆదివారం ఉప్పల్ జంక్షన్‌లో 'నో హాంకింగ్ అవేర్‌నెస్' క్యాంపెయిన్ నిర్వహించింది. ప్లకార్డులను ప్రదర్శిస్తూ వాహనదారులకు అవగాహన కల్పించారు. అనవసరమైన హారన్‌ల వల్ల కలిగే హానికరమైన ప్రభావాలను వివరించారు. హారన్ ఉపయోగించకుండా లైట్లను, బ్రేకులను ఉపయోగించి ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. పెరిగిపోయిన వాహనాలతో నగరంలో శబ్ద కాలుష్యాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. అవగాహనతోనే ప్రమాదాలను, సమస్యలను పరిష్కరించవచ్చునని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి

- మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

పీర్జాదిగూడ 8వ డివిజన్‌లో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

పీర్జాదిగూడ, ఫిబ్రవరి 9: గత బీఆర్ఎస్ పాలనలోనే మేడ్చల్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 8వ డివిన్‌లో అయన మాజీ మేయర్ వెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లతో కలిసి పర్యటించారు. డివిజన్‌లోని ఎస్ఎన్‌కాలనీలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘుపతిరెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

శామీర్‌పేట, ఫిబ్రవరి 9: లాల్‌గడి మలక్‌పేటలోని అంబేద్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం గ్రామ దేవతకు బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తల పూనకాల మధ్య బోనాల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఏఎస్‌రావును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులను అందజేసిన కేంద్ర ప్రభుత్వ చీఫ్ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ ఎస్. చంద్రశేఖర్

కాప్రా, ఫిబ్రవరి 9 : డాక్టర్ ఏఎస్‌రావును విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని జీవితంలో రాణించాలని కేంద్ర ప్రభుత్వ చీఫ్ సైంటిఫిక్ అడ్వైజర్, మాజీ సెక్రెటరీ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం డాక్టర్ ఏఎస్‌రావునగర్‌లోని హోమీ జేబాబా కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన 34వ డాక్టర్ ఏఎస్‌రావు సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమాజంలో ఏ సమస్యకైనా విజ్ఞాన శాస్త్రమే పరిష్కారాన్ని చూపుతుందన్నారు. విజ్ఞానం, సాంకేతికంగాలలో ప్రగతి సాధించిన దేశమే అగ్రభాగంలో నిలుస్తుందన్నారు. డాక్టర్ రామరాజు కౌన్సిల్ నివేదికను సమర్పించగా, పరీక్షకో కన్వీనర్ డాక్టర్ వై. అపర్ణ సైన్స్ విధి విధానాలను విశదీకరించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమొంటోలను బహూకరించారు. ప్రొఫెసర్ సీ నాగేశ్వర్‌రావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో అవార్డ్స్ కౌన్సిల్ జాయింట్ సెక్రెటరీలు చంద్రశేఖరం, వైవీ సుబ్బారావు, సలహాదారులు ప్రొ. ఎల్ ఎస్ రావు, ఉపాధ్యక్షులు కే.లక్ష్మణరాజు, డాక్టర్ కోమల, సభ్యులు ఎస్ఎల్ఎన్ రాజు, డాక్టర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శామీర్‌పేట, ఫిబ్రవరి 9: శామీర్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆదివారం లియోనియా వేదికగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ముందుగా విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, వినయ్, రవి, అనూరాధ, పుష్పలత, పద్మ, శ్రీరాములు, కృష్ణలను ఘనంగా సన్మానించి గురు భక్తిని చాటుకున్నారు. పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

చెరువు సుందరీకరణ పనులు చేపడతాం..

కార్పొరేటర్ శాంతికి వినతిపత్రం అందజేస్తున్న బస్తీ, కాలనీ వాసులు

ఉప్పల్, ఫిబ్రవరి 9 : చెరువులను సుందరీకరించి పరిసర కాలనీవాసుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జన్‌శేఖర్ అన్నారు. నాచారం ఎర్రకుంట పటేల్ కుంట చెరువులో గుర్రపు డెక్క పెరిగి దోమలు విపరీతంగా పెరిగాయని, అలాగే ఇదివరకు తొలగించిన గుర్రపు డెక్కను చెరువు కట్టపై వేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక బస్తీ వాసులు ఆదివారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెరువులోని గుర్రపు డెక్కను వెంటనే తొలగించి, చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం నిధులను విడుదల చేయాలని కోరారు. బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, జీవన్‌కుమార్, అనంతచారి, సయ్యద్ ఇబ్రహీం, సత్తార్, సలీం, రబ్బాని, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'జానెడు పొట్ట కోసం' నాటిక

మల్లాపూర్, ఫిబ్రవరి 9: రక్త కన్నీరు నాగభూషణం, బళ్లారి రాఘవ అవార్డు గ్రహీత, మాడుగుల కృష్ణమోహన్ నటించి రచన, దర్శకత్వం వహించిన చైతన్యరథం, జానెడు పొట్ట కోసం నాటిక ఆహూతులను ఆకట్టుకుంది. ఆదివారం మల్లాపూర్ డివిజన్ నెహ్రూనగర్ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ నాటిక ప్రదర్శనలో కళాకారులు తమ నటనతో చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో టీవీ రంగస్థల నటుడు ఐరేని రమేశ్‌గౌడ్, రామాయణం సత్యనారాయణ, నట చంద్రకళ అవార్డు గ్రహీత జి. మనుప్రియ, ఎంవీ ఫణిందర్, పవన్, రాఘవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఉప్పల్, ఫిబ్రవరి 9 : ఉప్పల్ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం శృతిలయ డాన్స్ అకాడమీ గురువు మంజుమోహిని శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. కళింగ నర్తన, నాట్య హెల్త్, కొలువై ఉన్నాడే, జయ జయ దుర్గే, మూషిక వాహన, రామాయణ శబ్దం, భో శంభో, తిల్లాన, బ్రహ్మమొక్కటే, వినాయక కౌతం కొలువైతివారంగా సాయి, నమశ్శివాయతే, బ్రహ్మాంజలి, అర్ధనారీశ్వరం, భామాకలాపం, బృందావన నిలయే, ఒకపరి కొకపరి, దశావతారం, జనుత శబ్దం మొదలైన అంశాలను కళాకారులు ప్రదర్శించారు కార్యక్రమంలో రోహిణి, శాంతి, నళినాక్షి, హాసిని, అనన్య, తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛతో కూలిరైతు మృతి

శామీర్‌పేట, ఫిబ్రవరి 9: మూర్ఛతో కూలిరైతు సాగు భూమిలో మృతి చెందిన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...మూడు చింతలపల్లి మండలం కేశవరం గ్రామానికి చెందిన బొగ్గుల గణేశ్(32) పొలంలో వరి నారు పంచే పనికి వెళ్లాడు. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో నారు పంచుతూ మూర్ఛ వ్యాధితో పొలంలోనే పడిపోయాడు. ఆ సమయంలో అతడిని ఎవరూ చూడకపోవడంతో ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

ఉప్పల్, ఫిబ్రవరి 9 : ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఉప్పల్ పోలీసుల కథనం ప్రకారం.. డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న వట్టిపల్లి శ్రావణ్ కుమార్(24) స్నేహితులతో కలిసి ఉప్పల్ కురుమానగర్‌లో నివాసం ఉంటున్నాడు. తెల్లవారుజామున ఉదయం సుమారు ఒంటిగంట 20 నిమిషాలకు తన రూమ్‌లో ఉన్న ఫ్యాన్‌కు టవల్‌తో ఉరివేసుకొని మృతిచెందాడు. మృతుడు సోదరుడు సందీప్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు అవివాహితుడు. మృతుడికి తల్లి, సోదరుడు ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కీసర, ఫిబ్రవరి 9; కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను క్రైం బృందం బాధితులకు అప్పగించింది.ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్, క్రైం బృందం సభ్యుడు జి.వెంకట నారాయణ, డిటెక్టివ్ సబ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి 4 సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు అందజేశారు.

అంబేద్కర్ ఆశయాలు కొనసాగిద్దాం..

బోడుప్పల్‌లో జ్ఞానమాల కార్యక్రమంలో పాల్గొన్న అంబేద్కర్ ఆశయ సాధన సంఘం నాయకులు

కీసరలో బీఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

బోడుప్పల్, ఫిబ్రవరి 9: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య పిలుపునిచ్చారు. బోడుప్పల్ కేంద్రంగా గత 312 ఆదివారాలుగా జ్ఞానమాల సమర్పణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని అన్నారు ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలకు ఆర్థిక, స్వేచ్ఛ, సమానత్వం, రాజకీయ ఫలాలు అందించడానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అనంతరం అంబేద్కర్ స్ఫూర్తితో కుల రహిత సమాజ సాధనకు కృషిచేస్తున్న రాపోలు శంకరయ్యను సన్మానించారు. కీసరగుట్ట దేవస్థానం డైరెక్టర్‌గా శంకరయ్యకు అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో దానగళ్ల యాదగిరి, ఐలయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు శివ, శ్రీకాంత్, శ్రీరాములు, యాకయ్య, బాబు, సురేశ్, బయన్న తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు 158వ జ్ఞానమాల

కీసర : మండలకేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు మండల అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో 158వ వారం జ్ఞానమాలను సమర్పించారు. ఆదివారం ఉదయం కీసర ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్‌కు జ్ఞానమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, నాయకులు కట్ట శంకరయ్య, జంగయ్య, బాల్‌రాజ్, భోగారం మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, రామారం రమేశ్, రాగుల రమేశ్, సాయులు, కనకయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 9 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశాడని డీఐసీసీఐ జాతీయ అధ్యక్షుడు పద్మశ్రీ నర్రా రవికుమార్ తెలిపారు. ఘట్‌కేసర్ అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అంబేద్కర్ జ్ఞానమాల 200వ వారానికి చేరిన సందర్భంగా జరిగిన భారీ బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ ఆశయాలు సాధిస్తామని ప్రమాణం చేశారు. ప్రబుద్ధభారత్ ఇంటర్నేషన్ ఆర్గనైజన్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మండల సహకార సంఘం చైర్మన్ రాంరెడ్డి, నాయకులు వజ్రేష్ యాదవ్, ముత్యాలు యాదవ్, రాధాకృష్ణ, సంజీవరెడ్డి, జంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు : సీఐ

చర్లపల్లి, ఫిబ్రవరి 9 : నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన భాస్కర్‌రెడ్డిని రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగిళ్ల బాల్‌రెడ్డి, మొగిలి రాఘవరెడ్డి, నాయకులు సీఐని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. కాలనీ సంఘాలు, సంక్షేమ సంఘాలతో సమావేశం నిర్వహించి నేరాల అదుపునకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు బీవీ నర్సింహారెడ్డి, మహేందర్‌రెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

కీసరగుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యుల నియమాకం

కీసర, ఫిబ్రవరి 9: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టికేలకు ట్రస్ట్ బోర్డు కమిటీని నియమించింది. గత నెల జనవరి 30న 'కీసరగుట్ట ట్రస్ట్ బోర్డు కమిటీ ఏర్పాటులో జాప్యం' అనే శీర్షికను 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన కాంగ్రెస్ పాలకులు కాంగ్రెస్ పార్టీ నుంచి కీసరగుట్ట ట్రస్ట్ బోర్డుకు 13మందితో కొత్త కమిటీని వేస్తు ఆదేశాలు జారీ చేసింది. సభ్యులుగా నల్లా మధుసుదన్‌రెడ్డి, కె. కృష్ణారెడ్డి, రాజుయాదవ్, ప్రవీణ్‌కుమార్, మొరుగు ముత్యాలు, దుర్గాప్రసాద్, అమరేందర్, కుమార్, రాజీరెడ్డి, అనిత, శంకరయ్య, సాయులు, ప్రభాకర్‌గౌడ్‌లను నియమించారు. దేవస్థానం సీనియర్ వేద పండితులు వేణుతల్ల బలరామశర్మను ఎక్స్ ఆఫీషియో మెంబర్‌గా నియమించారు. వీరంతా వచ్చే ఏడాది వరకు కీసరగుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యులుగా కొనసాగుతారు.

బ్యాంక్ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు

కీసర, ఫిబ్రవరి 9 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బీమా పథకాలను బ్యాంక్ అకౌంట్ కలిగిన ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని సోసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎన్జీవో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కోఆర్డినేటర్ కె. శ్రీనివాస్‌రావు తెలిపారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయం ఫేస్-2లో ఎస్ఎస్‌టీ కీసర సీఎఫ్ఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆర్థిక అక్షరాస్యత' కళాజాత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన సుకన్య సమృద్ధి యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 70 ఏండ్ల వయసు గల బ్యాంక్ ఖాతాదారులు రోడ్డు ప్రమాదాల్లో దుర్మరణం, వైకల్యం కలిగిన ఆమా బీమా పథకాలు వారి కుటుంబానికి అండగా నిలుస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీహరిగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అగోండాచారి, జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్‌రావు, ట్రెజరర్ రఘునాథ్, బ్లాక్ అధ్యక్షుడు రుద్రామచారి, ఎస్ఎస్‌టీ ఎఫ్ఎల్ కీసర మండల కోఆర్డినేటర్ విశ్వనాథ్, కౌన్సిలర్స్ ఉమామహేశ్వరి, కళాజాత బృందం పాల్గొన్నారు.

రెడ్డి సంఘం నూతన కార్యవర్గం

కీసర, ఫిబ్రవరి 9 : కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్మామి క్షేత్రం వద్ద రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా రామిడి విజయ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బండారి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా రామిడి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గుర్రం వరకాంత్‌రెడ్డి, బలిజోనిబావి అంజిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బాల్‌రెడ్డి, రాజిరెడ్డి,రామ్‌గోపాల్‌రెడ్డి, సలహాదారులు రాంరెడ్డి, బుచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రామిడి పుల్లారెడ్డి, గుర్రం బస్వారెడ్డి, కృష్ణారెడ్డి, రఘుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యదర్శికి సన్మానం

ఉప్పల్, ఫిబ్రవరి 9 : సీపీఎం తెలంగాణ రాష్ట్ర నూతన కార్యదర్శిగా ఎన్నికైన జాన్ వెస్లీని ఆదివారం ఉప్పల్ ఆఫీసులో సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం, రాష్ట్ర నాయకులు శ్రీరామ్‌నాయక్, హిమబిందు, వినోద, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.